సారంగాపూర్: లచ్చక్కపేటలో ధాన్యం కుప్ప చుట్టూ నిలిచిన వరద నీరు

మెట్‌పల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం కుప్ప చుట్టూ నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతు

అకాల వర్షం.. అపార నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు

సారంగాపూర్/కోరుట్ల, మే 21: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం, సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఈదురు గాలులకు బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుకకు వేసిన టెంట్లు కూలిపోయాయి. కోరుట్ల పట్టణంలో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. ఈదురుగాలులతో విద్యుత్ అధికారులు పట్టణంలో సుమారు రెండు గంటల పాటు సరఫరాను నిలిపి వేశారు.

మారుతీనగర్, మే 21: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పోసిన వరి ధాన్యం బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి తడిసినట్లు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులో ధాన్యం పోసి 20 రోజులు గడిచినా రేపు మాపు అంటూ నిర్వాహకులు తూకం వేయకుండా కాలం వెల్లదీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు, కేంద్రం నిర్వాహకులు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

30 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

జగిత్యాల టౌన్, మే 21: జిల్లాలో బుధవారం సాయంత్రం సుమారు 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మల్లాపూర్ మండలంలో 56.3 మిల్లీ మీటర్లు, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 54.3, రాయికల్ మండలంలో 49.0, జగిత్యాల మండలం పొలాసలో 46.8, ధర్మపురి మండలం జైనలో 41.3, ఎండపల్లి మండలం గుల్లకోటలో 35.5, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 32.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్, సారుగమ్మ వీధి, చిలుకవాడ, మార్కండేయ వీధుల్లో వరద నీరంతా మురుగు కాలువల గుండా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు పలు చోట్ల కరెంట్ వైర్లు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొనుగోలు కేంద్రం పరిశీలన

జగిత్యాల రూరల్, మే 21: జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు తుది దశకు వచ్చినట్లు డీఆర్డీవో రఘువరన్ తెలిపారు. మండలంలోని పొరండ్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కొనుగోళ్ల ప్రక్రియ, ధాన్యం రవాణా, ట్యాబ్‌లో డాటా ఎంట్రీ, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, జిల్లాలో 137 కేంద్రాలకు గానూ 65 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగతా కేంద్రాల్లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, గుల్లపేట లోని కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మార్కెటింగ్ డీపీఎం మల్లేశం పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీ రవీందర్, శ్రీనివాస్, వీవో ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో రఘువరన్

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ధర్మపురి, మే 21: ధర్మపురికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని దేవస్థానం రెనొవేషన్ కమిటీ మాజీ చైర్మన్ ఇందారపు రామయ్య బుధవారం ఆలయ ఈవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గోదావరిలోని బావి నుంచి నీటిని పైప్‌లైన్ ద్వారా దేవస్థానం ముందున్న సంపులోకి తెచ్చి, పైన ఉన్న సింటెక్స్ ద్వారా ఆలయానికి వచ్చే భక్తులకు అందిస్తున్నారని పేర్కొన్నారు. గోదావరిలో భక్తులు స్నానాలు చేసి, బట్టలు ఉతికిన కలుషిత నీటిని ఫిల్టర్ చేయకుండా అందించడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, వెంటనే ఈ విధమైన నీటి సరఫరాను నిలిపివేయాలని వినతి పత్రంలో కోరారు.

మాల విరమణ మండపంలో కూర్చున్న దీక్షాపరులు

దారులన్నీ కొండవైపే..

- హనుమాన్ దీక్షాపరులతో నిండిన కొండగట్టు
- మాల విరమణ చేసిన దీక్షాపరులు
- నేడు హనుమాన్ పెద్ద జయంతి

మల్యాల, మే 21: కొండగట్టు అంజన్న క్షేత్రంలో గురువారం నిర్వహించే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆంజనేయ స్వామి దీక్షాపరులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అంజన్న సన్నిధిలో మాల విరమణ చేసి, ఇరుముడి స్వామి వారికి సమర్పించారు. అనంతరం తలనీలాలు సమర్పించి, స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా, జయంతుత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి మూల విరాట్టుకు ప్రత్యేకాభిషేకంతో పాటు వేంకటేశ్వర స్వామి, అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో శ్రీకాంతరావు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేయించారు. జయంత్యుత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన వస్తున్న నేపథ్యంలో పోలీస్ ఔట్ పోస్టు, వై జంక్షన్, ఆలయం పక్కన, బొజ్జ పోతన వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు. ఎస్సై అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మల్యాల సీఐ నీలం రవి, మల్యాల, కొడిమ్యాల ఎస్ఐలు నరేశ్‌కుమార్, సందీప్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. కొండపైన వైజంక్షన్ వద్ద కరీంనగర్‌కు చెందిన ప్రకాశం గంజ్ ఫ్రెండ్స్ నేతృత్వంలోని వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే, కొండపైన పలు కళాబృందాల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జెర్సీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, తదితరులు

యువత అన్ని రంగాల్లో రాణించాలి

మల్లాపూర్, మే 21: గ్రామీణ ప్రాంత యువత అన్ని రంగాల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మండలంలోని రేగుంట గ్రామంలో బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీం సంజయన్న జట్టుకు సంబంధించిన జెర్సీలను క్రీడాకారులు, నాయకులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, నియోజకవర్గంలో క్రీడారంగం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. క్రీడాకారులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కుందేళ్ల నర్సయ్య, నాయకులు గణవేని మల్లేశ్‌యాదవ్, రాజోజి సాయిరామ్, బషీర్, అశోక్, క్రీడాకారులు వినోద్, శేఖర్, ముస్తఫా, నవీన్, నరేందర్, విజయ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మెట్‌పల్లి, మే 21: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో సబ్ జూనియర్ (అండర్ 12) అథ్లెటిక్స్ పోటీలను బుధవారం ఆయన పిల్లల వైద్యుడు చైతన్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ముత్తయ్యరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్‌లో విద్య, ఉద్యోగాలు, తదితర రంగాల్లో అనేక ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. రన్నింగ్, జంపింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు కార్తీక్, శంకర్, పీఈటీ రవికుమార్ పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాల రూరల్, మే 21: లక్ష్మీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మ్యాక్స్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. లక్ష్మీపూర్‌కు చెందిన నక్క సురేశ్, లక్కం వెంకటి, నీలం రాయబోసు, ఎక్కదేవి కుంటయ్య ధాన్యం తీసుకువచ్చి పది రోజులు గడుస్తున్నా హమాలీల కొరతతో కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో బర్రెలు, కుక్క మృతి

సారంగాపూర్, మే 21: బీర్‌పూర్ మండలం సిరిపురం సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడడంతో రెండు బర్రెలు, కుక్క మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడడంతో సామల శ్రీనివాస్, పర్స నర్సయ్యకు చెందిన రెండు బర్రెలు, వీర విగ్నేష్ పెంపుడు కుక్క మృతి చెందాయి. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

సారంగాపూర్, మే 21: జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ తెలిపారు. బీర్‌పూర్ సహకార సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ముప్పాల రాంచందర్ రావు ఆధ్వర్యంలో బుధవారం జీగుల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, రైతులు పట్టాపాసు పుస్తకంతో వచ్చి జీలుగ విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ తిరుపతి నాయక్, ఏఈవోలు శిరీష, వినోద్, సీఈవో అయ్యోరి తిరుపతి, సహకార సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు ప్రదానం

ఇబ్రహీంపట్నం/మేడిపల్లి, మే 21: క్యూఆర్‌కోడ్, సిటీజన్ ఫీడ్ బ్యాక్‌లో ఉత్తమ ప్రతిభ చూపినందుకు గానూ ఇబ్రహీంపట్నం, మేడిపల్లి పోలీస్ స్టేషన్లు ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యాయి. కాగా, హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా బుధవారం ఎస్ఐలు అనిల్, శ్యాంరాజ్ అవార్డులతో పాటు నగదు రివార్డులు అందుకున్నారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

జగిత్యాల రూరల్, మే 21: జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ కార్పొరేషన్, ఈబీసీ రుణాలకు సంబంధించి ఈనెల 22న అంబారిపేట, ధరూర్, హస్నాబాద్, మోతే, తిప్పన్నపేట దరఖాస్తుదారులకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 23న ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి అంబారిపేట, ధరూర్, హస్నాబాద్, మోతే, తిప్పన్నపేట అభ్యర్థులకు, 24న మైనార్టీ రుణాలకు సంబంధించి అంబారిపేట, ధరూర్ గ్రామాల అభ్యర్థులకు, 26న బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి ధరూర్, మోతే అభ్యర్థులకు, 27న అంబారిపేట, హస్నాబాద్, తిప్పన్నపేట గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాయికల్/కోరుట్ల రూరల్/పెగడపల్లి/సారంగాపూర్/మల్యాల/కథలాపూర్, మే 21: రాయికల్, కోరుట్ల, పెగడపల్లి, బీర్‌పూర్, మల్యాల, కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు గురువారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు బింగి చిరంజీవి, వోదెల రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చాలు, అవునూరి స్వాతి, శంకర్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, మే 21: మండల కేంద్రానికి చెందిన బుస రపు సాయిప్రసాద్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, మాజీ జడ్పీటీసీ జంగిలి సునీతాదేవి బుధవారం సాయిప్రసాద్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి మనోజ్ మృతదేహం

మల్యాల, మే 21: మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్ ఇటీవల పోలాండ్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. మనోజ్ మృతదేహాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సందర్శించి, నివాళులర్పించారు. కాగా, మనోజ్ మృతదేహం స్వగ్రామానికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

నేను ఎక్కడా సహనం కోల్పోలేదు

- మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మే 21: పత్రికా సమావేశంలో ఎక్కడా సహనం కోల్పోలేదని, పార్టీలో ఎక్కువ సార్లు గెలిచిన, ఓడిన వ్యక్తిని నేనే అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీభవన్‌లో స్థానిక ఎమ్మెల్యే అంశం చర్చకు రావడంతో చట్ట సభలకు ఎంపికయ్యే అభ్యర్థులు ఏ పార్టీ వారు అనేది స్పీకర్ మాత్రమే చెప్పగలరని చెప్పాను, అంతే తప్పా, నేను ఏదో సహనం కోల్పోయినట్లు, అసహనంగా మాట్లాడుతున్నానని అంటున్నారన్నారు. తాను గెలిచిన ఏ ఎన్నికల్లో అయినా జగిత్యాలలో మెజార్టీ వచ్చిందని, 1985లో రాజకీయాలకు అతీతంగా ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కోరుట్లలో ఘనంగా తిరంగా ర్యాలీ

కోరుట్ల, మే 21: పట్టణంలో బుధవారం సిటీజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని స్థానిక కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌక్ నుంచి నంది చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురభి నవీన్‌కుమార్, వెంకటేశ్, తిరుమల వాసు, నరేశ్, మహేశ్, సత్యం పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

మారుతీనగర్, మే 21: మెట్‌పల్లి పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి పట్టణ పద్మశాలీ సంఘం సాంస్కృతిక కార్యదర్శి ఎనుగందుల హనుమాండ్లు దంపతులు రూ.25,116, ఎలిగేటి శ్రీనివాస్ దంపతులు రూ.25,520 పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు ద్యావన పెల్లి రాజారాం, ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సంకు ఆనంద్, కోశాధికారి భాస్కర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవికొండలో పశువైద్య శిబిరం

పెగడపల్లి, మే 21: పెగడపల్లి మండలం దేవికొండలో మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 55 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి హేమలత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మతిన్, నర్సయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన యూనిఫాం అందేలా చర్యలు

జగిత్యాల రూరల్, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్డీవో రఘువరన్ పేర్కొన్నారు. పొరండ్లలో మహిళా సంఘాల సభ్యులు కుడుతున్న ఏకరూప దుస్తులను బుధవారం ఆయన పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మల్లేశం, ఏపీఎం గంగాధర్, సీసీ రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రాయికల్, మే 21: రామాజీపేట గ్రామంలో సీసీ రోడ్లు, ఇటిక్యాలలో పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటిక్యాల గ్రామానికి చెందిన అనుపురం పెద్ద లింబాద్రిగౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండగా వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాయికల్ మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ గణేశ్, పంచాయతీరాజ్ ఏఈ రాజమల్లయ్య, ప్యాక్స్ చైర్మన్ మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ హనుమాండ్లు, మాజీ సర్పంచ్ రమాదేవి-మోహన్, రవి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

రాయికల్, మే 21: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కిష్టంపేట గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఆధ్యాపకులు డాక్టర్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ రమేశ్, ఏవో ముక్తీశ్వర్, ఏఈవో సృజన, రైతులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మేడిపల్లి, మే 21: మేడిపల్లి మండలం కాచారం గ్రామంలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. విప్ ఆది శ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మేడిపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు.

జూనియర్ కళాశాలకు విరాళం

మేడిపల్లి, మే 21: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మేడిపల్లికి చెందిన ఎన్ఆర్ఐ చేపూరి నాగరాజు రూ. లక్ష బుధవారం విప్ ఆది శ్రీనివాస్‌కు అందజేశారు. నాగరాజును స్థానికులు అభినందించారు.

అటవీ భూమికి హద్దులు ఏర్పాటు

మెట్‌పల్లి రూరల్, మే 21: ఆత్మకూర్ శివారులో గల అటవీ భూమికి సంబంధిత అధికారులు హద్దులు నిర్ణయించారు. రంగారావుపేట బీట్ పరిధిలోని ఆత్మకూర్ శివారులో గల అటవీ భూములను పలువురు ఆక్రమించి చదును చేస్తున్నారని గ్రామస్తులు అధికారులకు గతంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విచారణ జరిపిన అధికారులు రెండు రోజులుగా ఆత్మకూర్ శివారులోని అటవీ భూమికి కందకం తీసే పనులు పూర్తి చేశారు. ఎక్స్‌కవేటర్‌తో కందకం తీసి హద్దులను నిర్ణయించారు. ఎఫ్ఆర్వో షౌకత్ అలీ కందకం పనులను పరిశీలించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 21: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. పూజల అనంతరం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

రాయికల్, మే 21: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్ యాదవ్, మండల, పట్టణ కోఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ గణేశ్‌కు బుధవారం వారు వినతి పత్రం అందజేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని, ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ చాంద్ పాషా, నీరటి శ్రీను, రాజేందర్ గౌడ్, పెంద్రం శ్రీనివాస్, లింగం గౌడ్, శివనీతి గంగారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బస్సులు నడపాలని వినతి

కొడిమ్యాల, మే 21: మండలంలోని చెప్యాల, రామకిష్టాపూర్, కొడిమ్యాల మోడల్ స్కూల్ వరకు ఉదయం, సాయంత్రం బస్సులు నడపాలని ఆర్టీసీ వేములవాడ డిపో మేనేజర్‌కు బుధవారం కొడిమ్యాల మాజీ సర్పంచ్ ఏలేటి మమత-నర్సింహారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ సంతోష్, తదితరులున్నారు.

బీడు భూములను గోదావరి జలాలతో తడిపిన ఘనత కేసీఆర్‌దే

సారంగాపూర్, మే 21: బీడు భూములను గోదావరి జలాలతో తడిపిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌దేనని ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టైపై మొదటి నుంచి కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై కుట్రలు పన్నుతుందని, అందులో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు చేసి నోటీసులు ఇచ్చిందన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేసీఆర్‌కు నోటీలు జారీ చేశారని ఆరోపించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు తేలు రాజు, నేరెల్ల సుమన్ గౌడ్, అనంతుల గంగారెడ్డి, కిషన్, మెరుగు రాజేశం, రాంచంద్రం, గంగన్న, రవీందర్, జగన్, తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

మల్యాల, మే 21: మల్యాల ఎక్స్‌రోడ్ చౌరస్తాలో గల ఎన్ఎస్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం జిల్లా విద్యాధికారి రాము సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను వచ్చే విద్యా సంవత్సరంలో నూతన మెళకువలతో విద్యార్థులకు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి

మెట్‌పల్లి రూరల్, మే 21: ఆత్మనగర్ శివారులో గుడుంబా స్థావరంపై మెట్‌పల్లి పోలీసులు బుధవారం దాడి చేశారు. ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడంతో పాటు 1500 లీటర్ల బెల్లం పాకం ధ్వంసం చేశారు. గుడుంబా బట్టీ నిర్వాహకుడు పరారు కాగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో పీసీలు విశాల్, ప్రణయ్ పాల్గొన్నారు.

ధాన్యం మిల్లులకు తరలించాలి

మెట్‌పల్లి రూరల్, మే 21: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంతో పాటు వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, డీసీవో మనోజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నాణ్యమైన విద్యనందించడమే సర్కార్ లక్ష్యం

మేడిపల్లి, మే 21: ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, కళాశాల భవన నిర్మాణం పూర్తయ్యే వరకు స్థానిక జడ్పీ హైస్కూల్‌లో తరగతుల నిర్వాహణకు ఏర్పాటు చేస్తామన్నారు. మూడు నెలల్లో భవనం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలో గ్రంథాలయం, జూనియర్ కళాశాల భవనాన్ని వారు పరిశీలించారు. కట్ల కుంటలో బీరప్ప కల్యాణ మహోత్సవానికి విప్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

దండెంపై బట్టలు ఆరేస్తుండగా..

- కరెంట్ షాక్ వ